—భండారు
సరోజినీదేవి



"అమ్మగారూ! అమ్మగారూ!" అన్న పిలుపుతో బాటు తలుపుమీద దబదబా బాదటం వినిపించి వెనక్కు తిరిగింది దేవమ్మ అప్పుడే వేసుకున్న బర్మా ముడి సర్దుకుంటూ.

నిదానంగా గుమ్మం దగ్గరికి వెళ్ళి గడియ తీయబోతూ హఠాత్తుగా ఆగిపోయి, "ఎవరూ?" అన్నది దేవమ్మ— "రకరకాల వాళ్ళు వస్తూంటారు. జాగ్రత్త! బస్తీ. నీ కసలే కొత్త" అన్న భర్త మాటలు తలచుకుని భయంగా.

"అయ్యగారు కారు పంపించారు. త్వరగా రండమ్మా" అన్నాడు డ్రైవరు బయటి నుండి.

"ఎవరయ్యా నీవు?" అన్నది దేవమ్మ, తలుపు తీయకుండానే మరింత గాభరాగా.

"అబ్బబ్బ! త్వరగా వచ్చేయండమ్మా! నేను దాసును. ఫాక్టరీ కారు డ్రైవర్ని. మిమ్మల్ని డిన్నరుకు తీసుకు రమ్మని కారు పంపారు. సరళమ్మగారు కూడా వచ్చారు—కారులో ఉన్నారు" అన్నాడు డ్రైవరు.

అప్పుడు ధైర్యంగా తలుపుతీసి, రెండు కప్ప తాళాలు తీసుకొని బయటికి వచ్చింది దేవమ్మ. తాళాలువేసి, ఒకసారి లాగిచూసి మరీ కదిలింది కారువేపు, తన కంచి పట్టుచీర కుచ్చిళ్ళు సవరించుకుంటూ.

డ్రైవరు కారు తలుపు తీసి పట్టుకున్నాడు. పక్కను సర్దుకొని కూర్చుంటున్న దేవమ్మ వేపు ఒకసారి చూసి చిరునవ్వుతో సరళ—"నమస్కారమండీ! నా పేరు సరళ. పరమేశ్వరరావుగారి భార్యను" అన్నది చేతులు జోడిస్తూ.

'ఎంచక్కా మొగుడి పేరు చెబుతున్నది ఈవిడ!' అని విడ్డూర పడింది దేవమ్మ. కానీ, పైకిమాత్రం ఏమీ అనలేదు. కాస్సేపటికి మళ్ళీ సరళే అడిగింది— "కొత్తగా వచ్చినట్లున్నారు. ఇల్లూ అదీ వసతిగా ఉన్నదా?" అని.

"ఆఁ! అదే వసతి!" అని చప్పరించింది దేవమ్మ. బాగుందంటే తమను ఖాళీచేయించి వాళ్ళు అద్దె పెంచి అందులో దిగుతారేమో? అని సందేహిస్తూ.

"మీ వారు ఈ వూళ్ళో ఎప్పుడూ పనిచేయలేదనుకుంటా" అన్నది సరళ.

"అవునండీ! ఇన్ని రోజుల నుండి మా వూళ్ళోనే ఉన్నాము. మా వారిని ప్రమోషన్ మీద ఈ మధ్యే బస్తీకి వేశారు. ఇంతలోనే ఈ డిన్నరులు, బొన్నరులు మనకెందు కంటే, మా వారు విన్నారేకాదు. అదీకాక ఈ బస్తీల్లో భయమని నా వడ్డాణం, కాసులపేరు కూడా మా వాళ్ళింట్లో పెట్టి వచ్చాను. సమయానికి అవి కూడా లేకుండా పోయాయి" అన్నది దేవమ్మ నిరుత్సాహంగా.

"అవి లేకపోయినా ఫరవాలేదు లెండి ఇప్పుడు" అన్నది సరళ అనునయిస్తున్నట్లు.

ఇంతలో కంపెనీ ప్రొప్రయిటర్‌గారి ఇల్లు వచ్చింది. ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

నియాన్‌లైట్లు చుట్టూ వెన్నెలలు చిమ్ముతున్నాయి. వాతావరణం చల్లగా, హాయిగా ఉన్నది. ఎక్కడినుంచో స్టీరియో సంగీతం శ్రావ్యంగా వినిపిస్తున్నది. లాన్స్‌లో రౌండుగా వేసిన గార్డెన్

ఛెయిర్స్‌లో ఆడామగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఇంతలో ఎవరో ట్రేలో కప్పులతో సరళా వాళ్ళ దగ్గరికి వచ్చారు. సరళ తా నొక కప్పు తీసుకున్నది. అది చూసి దేవమ్మ కూడా ఒక కప్పు తీసుకుంది.

తాగేసరికి ఉన్నట్లుండి ఎదురుగా భవనం ఒక్కసారి అటూ ఇటూ వూగింది. లోపలినుండి ప్రవాహం సుళ్ళు తిరుగుతూ, భళ్ళున ఎగదన్నినట్లయింది. నాడు మహాదేవుడు లోకాలను కాపాడటానికి హాలాహలాన్ని కంటం దిగనీయలేదట. నేడు దేవమ్మ లాన్స్ అందాన్ని చెడగొట్టకుండా రక్షించటానికి తన గొంతు దిగని ద్రవాన్ని, పట్టి బలవంతాన గుటక వేయటానికి విశ్వప్రయత్నం చేస్తున్నది. ఎలాగో అలాగ చివరికి గుటక వేసి వాంతి కాకుండా తమాయించుకొని సరళ వేపు చూసింది దేవమ్మ. "ఇదేమిటండీ కడుపులో తిప్పేట్లు?" అన్నది దేవమ్మ చేతిలోని కప్పు చూపిస్తూ.

"ఇదా? సూప్" అన్నది చిరునవ్వుతో సరళ, స్పూన్‌తో సూప్ నాజూకుగా సిప్‌చేస్తూ.

"అయ్యోరామా! పోపునీళ్ళా! బోర్నవిటా అనుకొని నోట్లో పెట్టుకున్నాను. వాంతి వచ్చినంత పని అయింది. అయినా భోజనాలకు రమ్మని చివరికీ సబ్బునీళ్ళతో పరివుచ్చారు కదా!" అన్నది దేవమ్మ కప్పు టీపాయ్‌మీద పెడుతూ.

"సబ్బు నీళ్ళు కాదండీ! భోజనానికి ముందు కొంచెం ఆకలి పుట్టటానికని ఈ సూప్ ఇస్తారు" అన్నది సరళ ఖాళీ కప్పు టీపాయ్‌మీద పెడుతూ, చిరునవ్వుతో.

"ఏం గొడవో! ఆకలి మందగించిన వాళ్ళకు కానీ, అందరికీ ఎందుకండీ ఈ మందులు?" అని దేవమ్మ అంటూండగా—

ఒకామె అందరికీ నమస్కారాలు చేస్తూ నవ్వుతూ పలకరిస్తూ, వాళ్ళవేపు వచ్చింది. సరళ లేచి నిల్చుని "నమస్కారమండీ!" అన్నది నవ్వుతూ.

దేవమ్మ కూడా లేచి నిలుచున్నది. ఆ వచ్చినావిడ తనవేపు గంభీరంగా చూస్తూ నిలుచున్న దేవమ్మ కేసి ఒక చిరునవ్వు విసిరి ముందుకు సాగిపోయింది.

"ఎవరండీ ఈవిడ?" అని అడిగింది దేవమ్మ సరళవేపు తిరిగి.

"ఆమేనండీ మన కంపెనీ ప్రొప్రయిటర్ గారి భార్య" నెమ్మదిగా అంది సరళ. తరవాత ఒక్క క్షణం ఆగి, "అన్నట్లు మీకు కొత్తగదా? నేను పరిచయం చేయవలసింది" అన్నది సరళ నొచ్చుకుంటూ.

"ఆఁ! పరిచయం చేసుకుంటే, తెల్లారి లేస్తే బదుళ్ళకు వస్తారు. అందుకనే కావాలనే నేను నా పేరు చెప్పలేదు సుమండీ!" అన్నది దేవమ్మ తెలివిగా నవ్వి.

అది విని నివ్వెరపోయింది సరళ—'ఇదెక్కడి మాలోకంరా బాబూ!' అనుకుంటూ.

ఇంతలో దేవమ్మ సరళ చేయి పట్టుకొని హటాత్తుగా లాగి "ఆ తెల్ల సూటేసుకున్నాయన చూడండీ! వీళ్ళకు దగ్గర బంధువయి ఉంటాడు. బొత్తిగా గర్వం లేదు, పాపం!" అన్నది మెచ్చుకుంటున్నట్లు.

"ఎవరండీ?" అన్నది సరళ దేవమ్మ చెబుతున్నది అర్థంకాక.

"అడిగో! అతడేనండీ! ఇందాకా ఆ మాయదారి సబ్బు నీళ్ళు మన కందించాడే? అతడే! ఇప్పుడు కప్పులు కూడా తీస్తున్నాడు" అన్నది దేవమ్మ ఎదుటగా వేలితో చూపిస్తూ.

"చంపారు పొండి! అతను బట్లరు. వాళ్ళ వంట వాడన్న మాట" అన్నది సరళ, వస్తున్న నవ్వు బిగబట్టుకుంటూ.



సౌందర్య దీప్తి

చిత్రం — ఎస్. శివశంకరయ్య (కొత్తగూడెం)

"ఆఁయ్! వీళ్ళ ఇల్లు బంగారంకానూ! వంటవాడికి ఇస్త్రీ బట్టలా! మా అత్తగారి ఇంట్లో కొళ్లాయి గుడ్డతో తిరుగుతాడు వంటవాడు" అన్నది దేవమ్మ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి.

"వాళ్ళకు బట్టలు కంపెనీవాళ్ళే ఇస్తారులెండి!" అన్నది సరళ ఈ గొడవంతా ఎవరన్నా వింటారేమో అని భయపడుతూ.

"మరి మావారి కెప్పుడూ కంపెనీ వాళ్ళు బట్టలు పెట్టినట్లు లేదు. మీవారూ ఇక్కడే పని చేస్తారుగా? మీ వారి కెప్పుడన్నా పెట్టారా?" అని అడిగింది దేవమ్మ.

"అబ్బే! మన వాళ్ళక్కాదండీ! చిన్న చిన్న పనివాళ్ళ కిస్తారు" అన్నది సరళ.

ఇంతలో అందరూ లేచి ఎదురుగా ఉన్న భవనంలోకి బయలుదేరారు. వాళ్ళతోబాటు సరళ కూడా బయలుదేరింది, దేవమ్మను తనతో రమ్మని సైగచేస్తూ. తీరా వీళ్ళు గుమ్మం దగ్గరికి వెళ్ళేసరికి ఒక సూటువాలా మరొక లావుపాటి లాల్చీ సేట్‌తో మాట్లాడుతూ దోవకడ్డంగా నిలుచున్నాడు.

"అయ్యయ్యో! ఈ నెవరో సైంధవుడిలా అడ్డం తగిలాడు. అవతల వడ్డించిన విస్తర్లన్నీ అయిపోతాయో, ఏమో?" అన్నది దేవమ్మ కంగారుగా.

ఇంతలో ఎవరో లోపలినుండి వీళ్ళను చూసి, "రండమ్మా" అని పిలిచాడు సాదరంగా.

అది విని సూటువాలా పక్కకు తప్పుకున్నాడు, లాల్చీ సేటుతో సహా.

'అమ్మయ్య!' అనుకుంటున్న దేవమ్మతో కలిసి డిన్నర్ హాల్లోకి అడుగు పెట్టింది సరళ.

అక్కడ రెండు పెద్ద పెద్ద బల్లలు వేసి వాటిపై తెల్లటి గుడ్డలు పరిచారు. రకరకాల కూరలు, ఆలూబాత్, పెరుగు వడలు మొదలైనవన్నీ సర్ది పెట్టారు. బాగా పొంగిన పూరీలను పెద్ద ప్లేట్లనిండా పేర్చి పెట్టారు. ద్రాక్షపండ్లు, బత్తాయిలు, కమలా ఫలాల తొనలు, ఏపిల్ ముక్కలు పెద్ద ప్లేట్లలకి ఉన్నాయి.

"అటుపక్క మరో దారి లేదా?" అన్నది దేవమ్మ హఠాత్తుగా.

"ఎందుకూ? ఏం కావాలి?" అడిగింది మెలగా సరళ.

"మరిచిపోయి మనలను వంటింట్లోకి తీసుకొచ్చినట్లున్నారు. ఇక్కడంతా తయారుగా బేసిన్లలోకి తోడి పెట్టుకున్నారు వడ్డనకోసం. అటుపక్క హాల్లో విస్తర్లు వేసి ఉంటారు" అన్నది దేవమ్మ తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు.

"విస్తర్లూ గిస్త్రలూ ఏమీ ఉండవు. ఇక్కడే భోజనం. మీరూ ఒకటి తీసుకోండి!" అన్నది సరళ తానొక ప్లేటు, నేప్‌కిన్ అందుకుంటూ.

దేవమ్మ తానూ ఒక నేప్‌కిన్ తీసుకుంది. "పెద్ద పెద్ద రుమాళ్ళే ఇచ్చారు" అన్నది మడత విప్పి చూసుకుంటూ.

"భలేవారే! ఎవరూ ఎవరికీ ఇవ్వలేదు. ఈ నేప్‌కిన్‌లు ఇక్కడే పెట్టిపోవాలి—చేతులు, మూతులు తుడుచుకొని" అన్నది సరళ నవ్వుకుంటూ, ఒక ప్లేటు దేవమ్మ కందిస్తూ.

ఇంతలో కంపెనీ ప్రొప్రయిటర్‌గారి భార్య వీళ్ళ దగ్గరికి వచ్చి, "అయ్యో! అలాగే నిలుచున్నారే? రండి. వడ్డించుకోండి. మీరే వెనకపడ్డారు" అన్నది నవ్వుతూ భుజం తడుతూ.

"థాంక్యూ!" అంటూ సరళ టేబుల్ వద్దకు నడిచింది, దేవమ్మను తనతో రమ్మని సైగ చేస్తూ.

దేవమ్మ వెనకాలే వస్తూ, "మనల్ని వడ్డించుకోమంటుందేమిటి? వంటకూ, వడ్డనకూ కలిపి మాట్లాడుకోలేదేమో వంటవాళ్ళను? లేకపోతే వీళ్ళ

సూట్లూ బూట్లూ చూసి డబ్బెక్కువ అడిగి ఉంటారు'' అన్నది ప్లేటు మీద డిజైన్ చూసుకుంటూ.

''అదేం కాదు ! ఇలాంటిచోట్ల ఇలాగే వడ్డించుకుంటారులెండి!'' అన్నది సరళ.

అక్కడంతా బల్లచుట్టూ చేరి వడ్డించుకుంటున్నారు. కొంతమంది చకచకా రెండు ఐటమ్స్ వేసుకొని చక్కా ఇవతలికి వస్తున్నారు. కొందరు నిదానంగా ప్లేట్లు నింపుతున్నారు. సరళ రెండు పూరీలు, ఇంత ఆలూబాత్, రెండు గరిటలు పెరుగు ఛట్నీ, రెండు పెరుగు వడలు వడ్డించుకొని వెనక్కు జరిగింది. దేవమ్మ అక్కడే నిలుచుంది, బల్లమీద పదార్థాల వంక చూస్తూ, మాంసం కూరలు పెట్టారేమో అని సందేహిస్తూ.

ఇంతలో సరళ వెనక్కు తిరిగి వచ్చి, ''మొహమాట పడుతున్నారా?'' అంటూ నవ్వుతూ దేవమ్మ చేతిలో ప్లేటు పట్టుకుని అందులో ఇంత ఆలూ బాత్, పెరుగు చట్నీ అవీ గబగబా వడ్డించేసింది. నెమ్మదిగా దేవమ్మను తీసుకుని ఒక పక్కకు నడిచింది.

''ఇందులో నీచు కాని కలవలేదు గదా!'' అన్నది దేవమ్మ అనుమానం బయట పెడుతూ.

''ఛ ఛ! పూర్తిగా కూరగాయల సరుకే. సంకోచం అక్కరలేదు'' అన్నది సరళ తినటానికి ఉపక్రమిస్తూ.

''ఏమండీ! ఎక్కడ కూర్చోవాలి?'' అన్నది దేవమ్మ ఒక చేత్తో ప్లేటు, మరొక చేత్తో నేప్‌కిన్ పట్టుకుని సరళ దగ్గిరికి వస్తూ.

''కూర్చోవటం ఉండదు, ఇలా నిలబడి తినటమే'' అన్నది సరళ నవ్వుతూ పూరీ తుంపుకుని నోట్లో పెట్టుకుంటూ.

''అయ్యో! ఒక పూటకు అడిగినా ఇవ్వరా అండీ!'' అన్నది దేవమ్మ మెల్లగా ప్రొప్రయిటర్ గారి భార్య వేపు చూస్తూ.

''ఏమిటండీ ఇచ్చేది?''

''అదేనండీ, ఇల్లు.''

''ఏ ఇల్లండీ! నా కర్థం కావటం లేదు'' అన్నది. సరళ ఆలూ బాత్, పెరుగు ఛట్నీ కలుపుకుంటూ.

''కార్యాల్లో భోజనాలకు కావాలంటే అద్దెకిస్తే వాళ్ళు ఒక్క హాలన్నా ఖాళీ చేసి ఇవ్వరా అంట! అయినా వీళ్ళు మాత్రం ఇల్లంతా అద్దె కివ్వు కోవట మెందుకూ?'' అన్నది దేవమ్మ దీర్ఘాలు తీస్తూ.


''అద్దె కివ్వట మేమిటి! ఇల్లంతా వీళ్ళ కిందనే ఉన్నది'' అన్నది సరళ పెరుగు వడ తింటూ.

''మరయితే విస్తర్లు వేసి చక్కగా వడ్డించ కూడదండీ? ఇంతమందిని పిలిచినప్పుడు ఈ దరిద్ర మేమొచ్చె—నిలబడి ఎడం చేత్తో ప్లేటు పట్టుకుని తినటం!'' అన్నది దేవమ్మ సీరియస్‌గా.

''ఈ పద్ధతి ఇంతేనండి. ఇల్లు లేక కాదు.'' అన్నది సరళ టేబుల్ దగ్గిరికి వెళ్ళి మరో రెండు పూరీలు, కూర వేసుకుని వస్తూ.

''అది సరే కాని, ఈ నేప్‌కిన్ బొడ్లో దోపుకోవచ్చా?'' అన్నది దేవమ్మ చుట్టూ కలియ జూస్తూ.

''ఇలా ప్లేటు కింద వేసి పట్టుకోండి'' అంటూ సరళ—''అదేమిటి! మీా రింకా భోజనం ప్రారంభించ లేదు. స్పూన్ కావాలా? తెచ్చుకోండి. అక్కడ ఉన్నాయి'' అని చూపించింది.



ముగ్గుల మెలికలు

—ఫొటో: ఎస్. జి. శేషగిరి—

''అలాగా!'' అంటూ బల్ల దగ్గిరికి పోయింది దేవమ్మ.

అక్కడ తెల్లటి ఫోర్కులు, స్పూనులు ఉన్నాయి.

'ఇవి వెండి వాటిలా ఉన్నాయి, మనం తీసుకో వచ్చో, లేదో? లేక ఎవరన్నా పెద్దవాళ్ళ కోసం పెట్టారేమో! తీసుకుంటే ఎవరన్నా ఏమన్నా అంటారేమో?' అని తటపటాయిస్తూ వెనక్కు తిరిగి సరళ వేపు చూసింది.

సరళ నవ్వుతూ, 'ఫరవాలేదు. తెచ్చుకోండి' అన్నట్లు నవ్వింది.

అందరూ తననే చూస్తున్నట్లు అనిపించింది దేవమ్మకు! ఆ కంగారులో తటాలున ఒక ఫోర్కు పట్టుకుని సరళ పక్కకు వచ్చి పడింది ఒక గంతులో.

ఇంతలో ప్రొప్రయిటర్‌గారి భార్య అటు వస్తూ ఎవరినో చూసి—''ఆ స్పూన్‌తోఆ నాజూకు తిండి ఏమిటి? దేవుడిచ్చిన చేతులతో శుభ్రంగా కలుపుకుని హాయిగా తినండి'' అంటూ నవ్వింది.

ఆమె మాటలు విన్న దేవమ్మ కంగారు పడి తాను తెచ్చిన ఫోర్కు ప్లేట్లో ఉంచి దానిపై పూరీలు కప్పింది.

''ఫరవాలేదు. భోజనం కానీయండి!'' అన్నది సరళ నవ్వాపుకుంటూ.

అప్పుడు ఫోర్కు బయటికి తీసి, ''ఈ చెంచా ఇలా ఉందేం గుచ్చుకున్నేటట్లు?'' అన్నది దేవమ్మ.

''అది ఫోర్కు. చెంచా తెచ్చుకోక పోయారా? పోనీలెండి. అది నెమ్మదిగా బల్ల మీద పడేసి

భోజనం కానీయండి. ఇంకెంత సేపు? అందరిదీ అయిపోవచ్చింది'' అన్నది సరళ.


''ఏదీ? ఆయన ఇంకా భోజనం మొదలుపెట్టలేదు. ఎదురుగా ఉన్నప్పుడు ఆయన్ను వదిలేసి ఎలా తింటాం చెప్పండి!'' అన్నది దేవమ్మ ప్రొప్రయిటర్ గారి దగ్గర అతిథి మర్యాదల హంగామాలో ఉన్న భర్తను చూపించి, ఫోర్కును ఎవరూ చూడకుండా బల్లమీద జారవిడుస్తూ.

''ఇలాంటి చోట అలాంటి పట్టింపు అక్కర లేదండి'' అన్నది సరళ ఎడంచేత్తో అప్పడాలు వడ్డించుకుంటూ.

''అయ్యయ్యో! ఎంగిళ్ళు కలిపితే మిగతా వాళ్ళెలా తింటారు పాపం!'' అన్నది దేవమ్మ వెనక నుంచి.

''ఇందులో ఎంగిలేమున్నది?'' అన్నది సరళ షాక్ తిన్నట్లు.

''ఎంగిలిప్లేటు పట్టుకున్న చేయి కడుక్కోకుండా వడ్డించుకుంటే ఎంగిలికాదూ?'' అన్నది దేవమ్మ విలదీసినట్లు.



చిచ్చుబుడ్డి కన్న చిరునవ్వు మిన్న!

ఫోటో—కె. వి. హనుమంతరావు

''ఇక్కడ ఆ పట్టింపులేమీ లేవండీ! పోనీ, నాలుగు ఏపిల్ ముక్కలన్నా వేసుకోండి'' అన్నది సరళ బతిమాలుతున్నట్లు.

''ఆ పండ్లు, ఫలాలు ఎవరో సుస్తీ వాళ్ళకు పథ్యానికని పెట్టి ఉంటారు. అవి కాస్త మనం పూర్తి చేస్తే, ఎట్లా?'' అన్నది దేవమ్మ మందలిస్తున్నట్లు.

సరళకు దేవమ్మ చాదస్తం చూస్తుంటే నవ్వు, చిరాకు, జాలి ముప్పిరి గొన్నాయి.

'అదృష్టవశాత్తూ వచ్చిన అతిథులలో చాలా మందికి తెలుగు తెలియదు కనుక బతికిపోయాం' అనుకుంది సరళ.

''పోనీ, పెరుగు చాలా బాగుంది. అదయినా వడ్డించుకోండి!'' అన్నది సరళ తాను పెరుగు వడ్డించుకుంటూ.

ఒక గరిటెడు పెరుగు తీసి ప్లేట్లో వేసుకుంటూ దేవమ్మ చప్పున సరళవేపు తిరిగి, ''చూడండి ఎలా తోడుకుందో! పెరుగు మావింట్లో ఇలా తోడుకొని చావదు. వీళ్ళెలా తోడు పెట్టారో, ఏమో?'' అన్నది ఆశ్చర్యంగా.

అన్నంలో పెరుగు కలిపి తినటానికి ముద్ద ఎత్తిందో లేదో, సోషల్‌గా అటూ ఇటూ తిరుగుతున్న కంపెనీ ఇంజనీరుగారి భార్య దేవమ్మ దగ్గరికి వచ్చి తన్ను తాను పరిచయం చేసుకుంటూ ఇంగ్లీషులో గలగలా మాట్లాడటం మొదలు పెట్టింది ఆప్యాయంగా. అంతే! దేవమ్మకు పెరుగూ అన్నం ముద్ద మింగుడు పడలేదు. ఇంతలో ''హల్లో!'' అంటూ ఇంకెవరినో పలకరిస్తూ ఇట్టే వెళ్ళిపోయిందా వచ్చినామె సుడిగాలిలా.

''ఈ కాస్త పెరుగన్నం కూడా తినకుండా అయింది ఈ బాడీ వేసుకున్నామె ధర్మమా అని!'' అన్నది దేవమ్మ చిరాకుగా.

''అది బాడీకాదు. దాన్ని స్లీవ్‌లెస్ జాకెట్ అంటారు. ఇంతకూ మీ పెరుగన్నం తినకుండా ఆమేం చేసింది?'' అన్నది సరళ అయోమయంగా.

''ఇంకేం కావాలి? మన కంచంలో నోరు పెట్టి మాట్లాడుతూంటే ఎలా తింటాం చెప్పండి. ఆవిడ తుప్పర్లన్నీ ఇందులోనే నాయె!'' అంది దేవమ్మ.

''అయ్యోరామ అదా!'' అంటూ నవ్వింది సరళ, దేవమ్మ వేపు జాలిగా చూస్తూ.

''ఇంతకూ ఈ ప్లేటు ఎక్కడ కడగాలండీ?'' అన్నది దేవమ్మ పెరుగు అన్నం వేపు బాధగా చూస్తూ.

''కడగటం దేనికి! ఇక్కడ పెట్టేయండి!'' అన్నది సరళ, తన ప్లేటు బల్లమీద పెడుతూ.

''మనకు మనమే వడ్డించుకోవాలిగదా? అందుకని మనమే కడుక్కోవాలేమో అనుకున్నాను'' అని పకపకా నవ్వింది దేవమ్మ, తన జోక్ అర్థంకాలేదా అన్నట్లు సరళవేపు చూస్తూ.

'పాపం! ఈ చాదస్తం మేళం ఏమీ తినలేదు' నొచ్చుకుంది సరళ. పోనీ, స్వీటయినా తింటుందేమో అనుకొని ఒక ప్లేట్‌లో స్వీట్ వేసి అందించింది.

''అన్నాలు తిని చేతులు కడుక్కున్న తరవాత ఇప్పుడు తీపి వడ్డనేమిటి? నే నప్పుడే అనుకున్నా—ఇన్ని రకాలు పెట్టుకున్నారాయె, తీపి తయారీ ఆలస్యమై సమయానికి అంది ఉండదని. పాపం! అయినా ఈ ఇంటామెకు కొంచెం వివరం తక్కువలా గుంది. పిండివంట జాగ్రత్తగా దాచుకొని సొంతంగా అందరికీ సర్ది వడ్డించుకోవాలి. అంతేకాని ఇలా బయట పెడితే అంతా క్షణంలో ఖాళీ చేయరూ?'' అంది దేవమ్మ హల్వా తింటూ.

ఇంతలో బట్లరు ట్రేలో కప్పులు పెట్టుకుని అటు వచ్చాడు.

''ఇదేమిటే! ఇంత చల్లగా ఉన్నది!'' అన్నది దేవమ్మ, బట్లరు తెచ్చిన ఐస్‌క్రీమ్ కప్పు అందుకుంటూ.

''ఇది ఐస్‌క్రీమ్—బాగుంటుంది-తినండి!'' అన్నది సరళ ఐస్‌క్రీమ్ చప్పరిస్తూ.

''మనకెందుకూ పెద్దవాళ్ళకు? పిల్లలుకొనుక్కు తినే ఐసు'' అన్నది దేవమ్మ, ముఖం చిట్లించి.

''పెద్దవాళ్ళుకూడా తినేదేలెండి—తినండి!'' అన్నది సరళ ఖాళీ కప్పు పక్కను పెట్టి కాఫీ అందుకుంటూ.

''ఏమోనమ్మా! అర్ధరాత్రి వేళ ఈ మంచుగడ్డే మెచ్చే గొంతులు వాయటానికి'' అంటూ తన కప్పు బల్లమీద పెట్టేసింది దేవమ్మ.

ప్రొప్రయిటర్ గారికి, ఆయన భార్యకు నమస్కారం చేసి ఒక్కొక్కరే బయటికి వస్తున్నారు.

''నేను అన్నం తినకపోవటం మంచిదే అయింది'' అన్నది దేవమ్మ.

''ఏం?'' అన్నది సరళ.

''వీళ్ళు కిరస్తానీలు'' అన్నది దేవమ్మ, క్రాపీ లాగిన మొహం పెట్టి.

''అబ్బే! కాదండీ! మనవాళ్ళే'' అన్నది సరళ.

''మరి ఇదేమిటి మొత్తంమనుషులు భోజనం చేసి పోతూంటే ఒక్కళ్ళకీ బొట్టు పెట్టలేదు!'' అన్నది దేవమ్మ.

''ఇది డిన్నరు. పేరంటం కాదుగా?'' అన్నది సరళ, ఆవిడకు ఎలా చెప్పాలో అర్థంకాక.

దేవమ్మ ఇంటివద్ద కారు దిగుతూనే—''అబ్బబ్బ ఇలాంటి డిన్నర్లకు నే రానండీ అని మొత్తుకుంటే విన్నారా? ఇక నుండి ఈ గొడవ నాకు పెట్టకండి'' అన్నది చిరచిరలతో, వీధి గుమ్మం తలుపువేస్తూ.

సరిగ్గా అదే సమయానికి కారులో వస్తుంటూ అదేమాట అంటున్నది తన భర్తతో సరళ—''ఇక నుంచి ఈ డిన్నర్లకు రమ్మనకండి, ఈ దేవమ్మను వెంటబెట్టుకొని. నవ్వాలో, ఏడవాలో తెలియలే. చచ్చిన చావయింది నాకు. పాపం! ఆ చాదస్తం మేళంతో'' అన్నది సరళ, ఇంకా తన పక్కనే దేవమ్మ ఉన్నట్లు భావిస్తూ.

★